క్లుప్తంగా

వేంకటరమణుడికి పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ఉన్న ప్రసన్న వేంకటమణస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వశాంతి, లోక కళ్యాణార్థం ప్రధాన అర్చకుడు నాగభూషణం ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ విగ్రహానికి పుష్పయాగం నిర్వహించారు. 8 రకాల పుష్పాలతో స్వామి వారి పాదాల నుంచి పుష్పాలతో నింపారు. అంతకుముందు ఉదయం స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, ధర్మకర్తల మండలి గౌని పాలాక్షి, భక్తులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



అలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్న ఆలయంలో శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నగదు అందజేస్తున్న వలంటీర్ ప్రసన్నలక్ష్మి

కూడేరు: మండలంలోని కొర్రకోడుకు చెందిన దుబ్బ గంగన్న అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రసన్న లక్ష్మీ సొంత ఖర్చులతో అనంతపురం వెళ్లి పింఛన్ నగదు అందజేసింది. వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో 'ఆస్పత్రికి వచ్చి నగదు ఇచ్చి ఆదుకున్నావ్ తల్లీ' అంటూ ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ వలంటీర్‌ను అభినందించాడు. ఇదంతా సీఎం జగన్ చలవేనని, మళ్లీ ఆయన అధికారంలోకి రావాలంటూ ఆనందం వ్యక్తం చేశాడు.

సైన్స్ మేజర్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

రాయదుర్గం రూరల్: సైన్స్ విభాగంలో ఉన్న మేజర్ కోర్సులు అధ్యయనం చేయడం వల్ల మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సూచించారు. స్థానిక కళాశాలలో సైన్స్ కాంగ్రెస్ సభలను పురస్కరించుకుని జూనియర్ కళాశాల విద్యార్థులకు మైక్రో బయాలజీ ఆధ్వర్యంలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, షటిల్ , చెస్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్ , గోవర్ధన్ , రవికుమార్, లక్ష్మీనారాయణ, నారాయణ, విజయ్ కుమార్, ప్రశాంత్, నరసింహులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- పండుగలా పింఛన్ల పంపిణీ



వజ్రకరూరులో పింఛన్‌దారుకు నగదు అందచేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని, ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా పింఛన్ల సొమ్ము రూ.3 వేలకు పెంచి పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి అండగా నిలిచారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న మినీ కల్యాణ మండపంలో వైఎస్సార్ పెన్షన్ పెంపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపు రాష్ట చరిత్రలో సరికొత్త అధ్యాయమన్నారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే సచివాలయం , వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రతి నెలా ఒకటోతేదీనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, లంచాలు ఇస్తే తప్పా పింఛన్ మంజూరయ్యేది కాదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోమారు మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ నాయకు చెప్పే కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని సూచించారు. సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు వచ్చే ఎన్నికల్లో అయనకు అండగా ఉండాలని కోరారు. అనంతరం పింఛన్‌దారులకు పింఛన్ సొమ్మును అందజేయడంతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి డిష్ సురేష్, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రానాయక్, పీఏసీ ఎస్ మాజీ అధ్యక్షుడు ముస్తురురెడ్డి, ఎంపీడీఓ విజయలలిత, సర్పంచులు ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో పింఛణ్ పంపిణీ పండుగలా ప్రారంభమైంది. రూ.3,000 పింఛన్ సొమ్ము తీసుకుంటున్న అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం పట్టణంలోని సచివాలయాల పరిధిలో మొత్తం 6,871 మందికి పింఛన్ పంపిణీ జరుగుతోంది. వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో కలిసి కౌన్సిలర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెంచిన పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. పేదలకు అండగా ఉండే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అవ్వాతాతలు, అక్కాచెల్లమ్మలు మరోసారి ఆశీర్వదించాలని కౌన్సిలర్లు కోరారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలోని దొడగట్ట, ఒంటిమిద్ది గ్రామాల్లో నూతన పింఛన్ కానుక రూ.3,000 లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కౌన్సిలర్ అబ్రహం మాట్లాడుతూ జగనన్న మాట ఇచ్చాడంటే కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కిరిటీ, మంజు, నాయకులు దొడగట్ట సూరి, గోవిందప్ప, బసిరెడ్డి, పాలన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రభావతి మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలకు అతీతంగా పింఛన్లు , సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా 54 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. సీఎం జగన్‌ను అవ్వతాతలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, వైస్ ఎంపీపీ వెంకటేశ్‌నాయక్, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సర్పంచ్ జీ. పూజ, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రాయదుర్గం పట్టణంలో పింఛన్ తీసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు



కళ్యాణదుర్గంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బ్రహ్మసముద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి

రేపు పింఛన్ల పంపిణీ

- హాజరుకానున్న ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం కొత్తగా ప్రభుత్వం పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీపీ కమలమ్మ తెలిపారు. కార్యక్రమానికి కళ్యాణదుర్గం సమన్వయకర్త ఎంపీ తలారి రంగయ్య హాజరవుతారన్నారు.

ఎంపీడీఓగా నాగభూషణ రెడ్డి



కూడేరు: ఎంపీడీఓ ఎంకే బాషా ఈ నెల 28 వరకూ మెడికల్ లీవ్ పెట్టారు. దీంతో జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్ గార్గ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కార్యాలయ సూపరింటెండెంట్ (ఏఓ) నాగభూషణ రెడ్డిని నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విద్యుత్ సరఫరాలో రేపు అంతరాయం

కూడేరు: మండలంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ గౌస్ శనివారం విలేకరులకు తెలిపారు. సోములదొడ్డి వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణపు పనులు చేపడుతున్నందున మండలానికి కరెంట్ సరఫరాని నిలిపి వేస్తున్నామన్నారు., ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఏఈ సూచించారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



కళ్యాణదుర్గం: జీసీటీఏ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు



రాయదుర్గం: ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ నాగమణి, ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం: స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 2024 ఏడాదికి సంబంధించిన జీసీటీఏ (ప్రభుత్వ కళాశాలల టీచర్స్ అసోసియేషన్) కాలెండర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి చేతుల మీదుగా జీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోనంకి శ్రీధర్, సభ్యులతో కలసి క్యాలెండర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో జీసీటీఏ సభ్యుడు చాముండేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేషయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సూర్యనాగిరెడ్డి, అధ్యాపకులు హరిచంద్ర, డాక్టర్ పీఎస్ శ్యామ్ ప్రసాద్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణ, రూరల్ శాఖ. గుమ్మఘట్ట శాఖ ఏపీటీఎఫ్ వార్షిక క్యాలెండర్, డైరీలను విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు నాగమణి, రామచంద్ర శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షుడు రామకృష్ణ, జనరల్ సెక్రటరీ మల్లికార్జున, అనిల్, ఖాసీం, రవిచంద్ర, గుమ్మఘట్ట శాఖ అధ్యక్షుడు పాండు, సిద్దేశ్వర, రంగప్ప, తిప్పేస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణరెడ్డి

కూడేరు: ప్రజా సమస్యలకు వెంటనే పరిష్కార మార్గం చూపాలని ఎంపీపీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగా కొన్ని శాఖల అధికారులు రావడం, కొందరు ఆలస్యంగా, మరికొందరు డుమ్మా కొట్టడంతో ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో అధికారులు లేకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని మండి పడ్డారు. ఎంపీపీ మాట్లాడుతూ గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. భూ రీసర్వేను రైతులకు ఇబ్బంది లేకుండా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు సూచించారు. కొందరు సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీల్లో డ్రైనేజీ, నీటి సమస్య ఉందని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం అధికారులు వారి శాఖలకు సంబంధించి చేపట్టిన, చేపట్టబోయే పనులను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్విని, వైస్ ఎంపీపీలు దేవ, సుబ్బమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి, ఏఓ విజయ కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసులు, ఏపీఎం రాజశేఖర్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఎగ్జిబిషన్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బెళుగుప్ప: మండలంలోని అంకంపల్లి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు పొందారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ముత్యాలప్ప మాట్లాడుతూ ఏపీ గణిత ఫోరం వారు అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో గణితంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని శ్రావణి వ్యాసరచన, మీనాక్షి వక్తృత్వపు పోటీల్లో విజయం సాధించారన్నారు. 8వ తరగతి విద్యార్థి కళ్యాణి సుడోకు విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. విద్యార్థులకు గైడుగా ఉన్న ఉపాధ్యాయులు మహబూబ్‌ఖాన్, కుమారస్వామిని హెచ్‌ఎం అభినందించారు.

ఘనంగా గంధం వేడుకలు



గంధాన్ని దర్గాకు తీసుకొస్తున్న దృశ్యం

కణేకల్లు: పట్టణంలోని రామనగర్‌లో ఉన్న దివానేపీరావలి ఉరుసు శనివారం ప్రారంభమైంది. శనివారం రాత్రి గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తారకరామనర్‌లోని ఇస్మాయిల్ ఇంటి నుంచి గంధాన్ని మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి దివానేపీరా సమాధి వద్ద సమర్పించారు. భక్తులు దర్గాలో చెక్కర ఫాతేహాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో దివానేపీరావలి సమాధి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీటీ డైరెక్టర్లు

కుందుర్పి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ఆర్డీటీ ఎకాలజీ సంస్థ పనిచేస్తోందని ఆ శాఖ జిల్లా డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు హనుమంతరాయుడు, సత్యనారాయణశెట్టి తెలిపారు. శనివారం మండలంలోని జంబుగుంపలలో ఆర్డీటీ వాటర్ షెడ్డు కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ ఎకాలజీ సంస్థ రూ.13కోట్లతో జంబుగుంపల పంచాయతీలో రాబోవు మూడేళ్ల పాటు పాడిపరిశ్రమ, భూఅభివృద్ధి, పండ్లతోటల పెంపకం, ఫారంపొండ్లు, చెక్‌డ్యాంల తవ్వకాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర, ఎస్ఎంఎస్ శివతేజా, ఎస్డీఓలు రామాంజనేయులు, వెంకటేశులు సిబ్బంది గంగమ్మ, రైతులు, మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



విద్యార్థులను సత్కరించిన ఫౌండేషన్ సభ్యులు

ఉరవకొండ: జైకిసాన్ ఫౌండేషన్ అధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు విశిష్టతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు శనివారం బహుమతులు అందించారు. ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పలు ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్స్, ప్రవేట్ స్కూల్స్‌లో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, మోడల్స్ అందించారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జైకిసాన్ పొండేషన్ అధినేత నాగమల్లి ఓబుళేసు మాట్లాడుతూ రైతుల గొప్పతనం వివరించేందుకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న పట్టు పరిశ్రమ జిల్లా అధికారి ఆంజనేయులు

వజ్రకరూరు: పట్టు పురుగుల పెంపకంలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో పట్టు పురుగుల పెంపకంలో పాటించవలసిన మెలకువలు, నూతన యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తి చూపాలన్నారు. పట్టు పురుగుల పెంపకం దారులకు ప్రభుత్వం పలు సబ్సిడీలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుశీలారాణి, ఎంపీటీసీ ఫిరోజ్‌భాను, రైతువిభాగం రాష్ట కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, మైనార్టీ నాయకుడు మున్నా, వీఏఏ సురేష్‌నాయక్, పట్టు పరిశ్రమ సహాయకులు సురేష్‌నాయక్, వన్నప్ప, మద్దిలేటి, లక్ష్మిదేవి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి

గుమ్మఘట్ట: మండల స్థాయిలో ఈనెల 10న నిర్వహించే ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ రామచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, డీజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మండలంలోని గుమ్మఘట్ట, వీరాపురం, గలగల గ్రామాల్లో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాపోటీలను విజయవంతం చేసేందుకు పీఈటీలు కృషిచేయాలన్నారు.



ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



గుమ్మఘట్టలో రథంలో ఊరేగుతున్న ఆంజనేయస్వామి

గుమ్మఘట్ట: మండలంలోని గుమ్మఘట్ట, బీటీపీ గ్రామాల్లో ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ఆకు పూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, పూర్ణాహుతి తదితర పూజలు చేపట్టారు. అనంతరం రంగురంగుల జెండాలు, మామిడి తోరణాలు, అరటిగెలలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి రథంలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆయా గ్రామాల్లో మేళతాళాలు డప్పులతో ఊరేగించారు. వీరభద్రుడి వేషధారణల్లో చేసిన విన్యాసం ఆకట్టుకుంది. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. యువకులు రథోత్సవం ముందు నందికోళ్లతో నృత్యం చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భీమక్క, నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, మల్లికార్జున, తిప్పేస్వామి, ఉమేష్, బీటీపీ హనుమంతు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీటీపీలో ఆంజనేయస్వామి రథోత్సవ దృశ్యం

2,554 మందికి పింఛన్ల పంపిణీ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయితీల్లో 2,554 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు రెండు రోజుల్లోగా పంపిణీ చేస్తామన్నారు.

కొత్తగా 140 పింఛన్ల మంజూరు

కణేకల్లు: మండలంలో కొత్తగా 140 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కాగా పింఛన్‌ను రూ.3,000కు పెంచడంతో లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్‌డీ బాలాజి సూచించారు. శనివారం మండలంలోని దురదకుంట, బొట్టువానిపల్లి పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్లతో మందులను ఎలా పిచికారీ చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.